## విజయవాడలో ఎస్ఈఐఎల్ ఎనర్జీకి కొత్త కార్యాలయం



**ముత్తుకూరు, జనవరి 4, ప్రభాతవార్త:** భారత దేశంలోని అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలలో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ విజయవాడలో తన కార్యా లయాన్ని ప్రారంభించినట్లు ఈరోజు ప్రకటించింది. ఈ కార్యాలయాన్ని ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈఓ జన్మేజయ మహాపాత్ర వర్చు వల్‌గా ప్రారంభించారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీకి ఆంధ్రప్రదేశ్ కీలక రాష్ట్రంగా ఉంది. సంస్థకు చెందిన మొత్తం 2,640 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థంలో గణనీయమైన భాగం రాష్ట్రంలోని పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చేందుకు వినియోగించబడుతోంది. ఈ కొత్త కార్యాలయం ద్వారా రాష్ట్రంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఉనికి మరింత బలోపేతమై, వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడానికి సహకరిస్తుంది. ఈ సందర్భంగా ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈఓ జన్మేజయ మహాపాత్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మా అత్యంత ముఖ్యమైన మార్కెట్, రాష్ట్రంలోని విద్యుత్ వృద్ధి ప్రగతికి మద్దతు ఇవ్వడానికి మేము కట్టుబడి ఉన్నాం. ఈ కార్యాలయం మా కార్యకలాపాలకు కీలక కేంద్రంగా మారి, వినియోగదారులకు విశ్వసనీయమైన మరియు స్థిరమైన విద్యుత్ సరఫరాను అందించడంలో సహాయపడుతుంది అని తెలిపారు. భద్రత, విశ్వసనీయత, స్థిరత్వంపై ప్రత్యేక దృష్టితో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ భారత విద్యుత్ రంగంలో ప్రముఖ సంస్థగా నిలిచింది .ఆంధ్ర ప్రదేశ్‌లో సంస్థ విస్తరణ రాష్ట్రం రాష్ట్ర ప్రజల పట్ల ఎస్ఈఐఎల్ ఎనర్జీ యొక్క నిబద్ధతను స్పష్టంగా చాటుతోంది.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**నెల్లూరు సిటీ, జనవరి 4, ప్రభాతవార్త :** సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆదివారం బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయం నందు రాష్ట్ర అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ బీసీ సంక్షేమ సంఘం సేవ కమిటీ సభ్యులు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరి ంచడం ఆనందంగా ఉందన్నారు. అలాగే సేవా కమిటీ సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా చేసే సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అట్రాసిటీ యాక్ట్ ముసాయిదా ను విడుదల చేయడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో వి. శ్రీనివాసులు, ఐ. రమేష్, జయరామరాజు, కేశవాచారి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్ డీఈఈ లక్ష్మినారాయణకు ఘనంగా వీడ్కోలు



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 4, ప్రభాతవార్త :** పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో 33 సంవత్సరాలు పాటు వివిధ హోదాలలో పనిచేసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హోదాలో ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మినారాయణకు ఆ శాఖ అధికారులు ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. వెంకటగిరి సబ్ డివిజన్‌లో డీఈఈగా పనిచేస్తూ డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మినారాయణకు అభినందన వీడ్కోలు సభ ఆదివారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీరాజ్ ఎస్ఈ కోటేశ్వరరావు రిటైర్డ్ సిఇ అశోక్ కుమార్, తిరుపతి డిపిఆర్ఈఓ మధుసూదన్ రావు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్వి మురళీ కృష్ణం నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కే సంజీవరావు, డిప్లమో ఇంజనీర్ల సంఘం గౌరవ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, జిల్లా పంచాయతీ రాజ్ ఈనెల సంఘం అధ్యక్షులు ఏం బాబురావు, డిప్లమో ఇంజనీర్ల సంఘం గౌరవ అధ్యక్షులు మున్వర్ తదితరులు ఈ సందర్భంగా లక్ష్మి నారాయణ పని తీరును కొనియాడారు. వర్క్ ఇన్స్పెక్టర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టిన లక్ష్మి నారాయణ నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, కావలి, కోవూరు తదితర ప్రాంతాలలో ఎనలేని సేవల ందించారన్నారు. అంకితభావంతో వృత్తిపట్ల నిబద్ధత, తోటి ఉద్యోగులతో సఖ్యతగా మెలిగే లక్ష్మినారాయణ దేశ జీవితం సాఫీగా సాగాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ దంపతులను దుశ్యాలువాలు, మెమెంటోలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

## పాత కక్షలతో దాడి

**- నిద్రలో ఉన్న నాపై దాడి చేశారు - నారాయణ ఆరోపణ**



**తోటపల్లి గూడూరు, జనవరి 4, ప్రభాతవార్త :** మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలో నారాయణపై జరిగిన దాడి ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దాడి వెనుక పాత కక్షలే కారణమని నారాయణ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నారాయణ తెలిపిన వివరాల ప్రకారం, తనతో కలిసి మద్యం సేవించిన వ్యక్తులే అనంతరం తనపై దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. తాను నిద్రలో ఉన్న సమయంలో అకస్మాత్తుగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు చెప్పారు. అనంతరం కేసు తమపై పడకుండా ఉండేందుకు తనకు మద్యం తాగించినట్లు నారాయణ ఆరోపించారు. అంతేకాకుండా, ఈ ఘటన బాధ్యతను తన అన్న కుమారుడు, కోడలపై మళ్లించే ప్రయత్నం కూడా జరిగినట్లు ఆయన తెలిపారు. దాడి చేసినవారే అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఉండవచ్చేమో అన్నారు, నన్ను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి, ఏమీ తెలియనట్లుగా పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు నారాయణ పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకునేలోగానే, సంబంధిత వ్యక్తులు ఆసుపత్రి పరిసరాల్లోనే తిరుగుతూ ఉండటం పలు అనుమానాలకు తావిచ్చిందని చెప్పారు. అనంతరం తనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయించి, ఆసుపత్రి బయటే వదిలివెళ్లిన ఘటనపై కూడా నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు సమాచారం. నారాయణ కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆయన కుమార్తె, ఈ దాడిపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరుతున్నారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ దాడి జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, పోలీసుల విచారణపై స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## శ్రీరామ క్రియా ధ్యాన శిక్షణ



**సంగం జనవరి 4ప్రభాతవార్త :** సంగం తిరమ నకొండలోని శ్రీరాజరాజేశ్వరి దేవి జ్ఞానపీఠంలో పుష్య పౌర్ణమి ,శివ ముక్కోటి సందర్భంగా అన్ని జిల్లాల నుండి వచ్చిన ధ్యాన సాధకులకు పీఠాదిపతులు శ్రీరాజ రాజేశ్వ రానందస్వామి శ్రీరామ క్రియాద్యాన సాధన రహస్యాలు వివరించి అందరిచేత ధ్యానం నాడి శుద్ధి, అను లోమ ,వినులోమ సమసర్వ ప్రాణాయామ సాధన శిక్షణ నిర్వహించారు. భగవంతుడు సర్వాంతర్యామిగా ఉన్నాడని ప్రాణశక్తి వలన 84 లక్షల జీవరాశిగా అవి ఆవిర్భవించాయని సూర్యచంద్రుల వలన,భూమి మీద జీవరాశిని సృష్టి స్థితి లయం జరుగుచున్నదని స్వామిజీ వివరించారు. శ్వాసని సమస్వరం ద్వారా సక్రమంగా నియంత్రిస్తే సంపూర్ణ ఆరోగ్యం,ఆత్మజ్ఞానం,కార్యసిద్ధి, పొందవచ్చునని అన్నారు. అభిషేకాలు,కుంకుమార్చన, లలితాయజ్ఞం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## ఘనంగా టిడిపి నాయకులు దువ్వూరు కృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతి



**చిల్లకూరు, జనవరి 4, ప్రభాత వార్త :** చిల్లకూరు మండలం బల్ల వోలు గ్రామం నందు గత 40 సంవ త్సరాలు తెలుగుదేశం పార్టీకి ఎనలేని కృషి చేసిన కీర్తి శేషులు దువ్వూరు కృష్ణారెడ్డి ప్రథ మ వర్ధంతి బంధువులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమా నుల మధ్య అట్టహాసంగా నిర్వహి ంచారు. కృష్ణారెడ్డి ప్రథమ వర్ధం తి సందర్భంగా కృష్ణారెడ్డి అన్న కుమారుడు దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి దంపతులు బల్లవోలు గ్రామంలోని 400 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి దంపతులు, తిరుపతి జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు పుచ్చూరు వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాలు లీలావతి, తమ్మిన పట్నం కోదండరామస్వామి దేవస్థానం చైర్మన్ కోట సతీష్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జాకీర్ హుస్సేన్, మేకల కిషోర్, టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, మైలం శ్రీనివాస్ రెడ్డి, అన్నా రెడ్డి రమేష్ రెడ్డి, అబాక రమణారెడ్డి, పోనక వేణు గోపాల్ రెడ్డి, నందకుమార్, వేళ్ళపాలెం సర్పంచ్ రావుల వెంకటేశ్వర్లు, మేఘనూరు వెంకటకృష్ణయ్య, మూగశంకరయ్య, తెలుగు మహిళా మాజీ అధ్యక్షురాలు చెరుకూరు పద్మజ షఫీ, ఉదయ శేఖర్ రెడ్డి, కుమారి సాయి, నెలబల్లి భాస్కర్ రెడ్డి, ఒబ్బాయి శివకుమార్ , శివయ్య, ఎల్లసరి కోటయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు దువ్వూరు రామచంద్ర రెడ్డి, చాకారా లక్ష్మి నరసింహం, శేఖర్ బాబు వినోద్, వెంకటేష్, సుభాష్, జనసేన, బిజెపి నాయకులు, ఇంకా పలువురు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. ఈ సందర్భంగా దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి, ప్రజా నాయకుడు మా చిన్నాన్న దువ్వూరు కృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతిని జయప్రదం చేసినటువంటి అందరూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు, బల్లవోలు గ్రామ ప్రజలకు, కొరోపాలెం గ్రామస్తులకు, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు.

## విద్యుత్ ఛార్జిల తగ్గింపుపై ఎమ్మెల్యే కాకర్ల హర్షం



**వింజమూరు, జనవరి 4, ప్రభాతవార్త :** రాష్ట్రంఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి, ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం పట్ల ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేషన హర్షం వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2014-19 మధ్య కలానికి సంబంధించి 4,498 కోట్ల ట్రూ అఫ్ ఛార్జిలను వసూళ్ల చేయాలంటూ, ఏపీఆర్సీ ఇటీవల కూటమి ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. అయితే ఆ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారని ఎమ్మెల్యే తెలిపారు. ట్రూ డౌన్ అమలు ద్వారా విద్యుత్ ఛార్జీల్లో యూనిట్‌కు 13 పైసలు తగ్గించారని చెప్పారు. గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యుత్ రంగాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని 1.29 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారని, ఐదేళ్ల అరాచక పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి దాదాపు 32 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విమర్శించారు. కమీషన్లకు కక్కుర్తి పడి విద్యుత్ కొనుగోలు చేసి జేబులు నింపుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాడిలో పెట్టారని ఎమ్మెల్యే తెలిపారు. అధికారం చేపట్టిన వెంటనే విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని హామీ ఇచ్చారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఆక్వా రైతులకు యూనిట్ కు 3.5 రూపాయలు వసూళ్లు చేస్తే, తమ ప్రభుత్వం దాన్ని 1.5 రూపాయలకు తగ్గించిందని చెప్పారు. అలాగే జగన్ పాలనలో 5.19 రూపాయలకు విద్యుత్ కొనుగోలు చేస్తే, కూటమి ప్రభుత్వం 4.70 రూపాయలకే కొనుగోలు చేస్తుందని చెప్పారు. అంతే కాకుండా రాష్ట్రంలో సోలార్ పవన విద్యుత్ ఏర్పాటే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, సోలార్ పవర్‌ను ప్రోత్సహించేందుకు రాయితీలు కూడా కూటమి ప్రభుత్వం కల్పిస్తోందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చెప్పారు.

## ఘనంగా ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం



**మర్రిపాడు, జనవరి4, ప్రభాతవార్త:** అనంతసాగరం మండలం చిరువెళ్ళ ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యా యుడిగా పనిచేస్తూ గతనెల 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందిన పొంగూరు గ్రామానికి చెందిన హెచ్. మోహన్‌ప్రసాద్ ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం మర్రిపాడు మండల కేంద్రంలోని జిఆర్ఎస్‌యుటిఎఫ్ భవనంలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆదర్శ ఉపాధ్యాయుడిగా, యుటిఎఫ్ ప్రముఖ నాయకుడిగా , అక్షరాస్యత, జనవిజ్ఞానవేదిక తదితర సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేసిన వ్యక్తిగా , విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి, సామాజిక అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియా డారు. ఈకార్యక్రమంలో మర్రిపాడు మండల విద్యాశాఖ అధికారి-1 తిరుపతయ్య, అనంతసాగరం మండల విద్యాశాఖాధికారి-2 ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరుకు చెందిన ప్రజా వైద్యులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, లాయర్ శేషారెడ్డి, విశ్రాంత మండల విద్యాశాఖాధికారులు గోవిందయ్య, సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు కలిశెట్టి వెంకటరమణయ్య, మస్తానయ్య, జి.సుబ్బరాయుడు, గంగాధర్, సత్యం, ఇజల్లా రైతు సంఘం నాయకులు మూలి వెంగయ్య, యుటిఎఫ్ రాష్ట్రనాయకులు బాబురెడ్డి, జిల్లా నాయకులు అచ్చయ్య, శేషులు, చలపతిశర్మ, ఖాజావలి, మురళీధర్, నాయబ్, సాంబశివారెడ్డి, ఇస్మాయిల్, సుబ్బరాయుడు, తిరుపాలు, వెంగయ్య, యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి, కటారి సుధాకర్, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు , బంధుమిత్రులు పాల్గొన్నారు.

## చెందోడులో రంగవల్లుల పోటీలు

**కోట, జనవరి 4 ప్రభాతవార్త :** కోట మండలం చెందోడు గ్రామంలోని ఎంవిరావు ఫౌండేషన్ కార్యాల యం లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని మహి ళలు, బాలికలకు వేర్వేరుగా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం విజేతలకు చెందోడు సర్పంచ్ దేవారెడ్డి మాధవి చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ముందస్తుగా సంబరాలు నిర్వహించడం, అందులో తాను భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందని మాధవి అన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అనిత, ద్వితీయ స్థానం ఎం.రాజేశ్వరి, తృతీయ స్థానం కె.శ్రీదేవి, మరో ఐదుగురికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ ఎం. లీలామో హన్‌కృష్ణ, కార్య దర్శి ఎం.విజయలక్ష్మి, ధరణి, డి.భార్గవి, మాధవి, పూర్ణిమ, ప్రమీలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త కోమల, నాయుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత విఆర్ఓ సత్యం నేత్రదానం



**కావలి, జనవరి 4 ప్రభాతవార్త :** తాను మరణించినా మరో ఇద్దరు కార్నియా అంధులలో సత్యనారాయణ జీవించి ఉంటారని కావలి రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డి.రవిప్రకాష్ పేర్కొన్నారు. పట్టణంలోని రాజావీధికి చెందిన విశ్రాంత గ్రామ రెవెన్యూ విఆర్ఓ, రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు అన్నలూరు వెంకట సత్యనారాయణ(63) శనివారం రాత్రి మృతి చెందారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ గత 25ఏళ్ళు నుంచి రెడ్‌క్రాస్ జీవిత సభ్యునిగా కొనసాగుతున్న సత్యనారాయణ గతంలోనే తన నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాన్ని రెడ్‌క్రాస్‌కు అందజేయడం జరిగిందన్నారు. ఆయన కుమారుడు శశికిరణ్, సమీప బంధువు కళ్యాణ్‌లు అందించిన సమాచారం మేరకు రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం సభ్యులు నేత్రదాన ఏర్పాట్లు చేశారు. నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి దానంచేసిన నేత్రాలను కార్నియా రికవరీ స్పెషలిస్టు సునీల్ సేకరించారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 159వ నేత్రదానమని నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి పేర్కొన్నారు. సత్యనారాయణ భౌతికకాయాన్ని తహశీల్దార్ శ్రావన్‌కుమార్, కొండాపురం మండల తహశీల్దార్ మలిశెట్టి సురేష్‌బాబు, జిల్లా గణాంక అధికారుల సంఘం కార్యదర్శి రసపుత్ర రమేష్ సింగ్, రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, పలువురు రెవెన్యూశాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు.

## హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించిన ఎంవిఐ సుందరరావు



**కావలి, జనవరి 4 ప్రభాతవార్త :** 37వ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం కావలి సమీపంలోని టోల్‌గేట్ వద్ద కావలి మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఆర్.సుందరరావు హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులకు, రాంగ్‌రూట్‌లో వెళ్ళే వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరిగింది. అనంతరం అవగాహన కల్పించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. రోడ్డు భద్రతానియమాలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని అలా పాటించని వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## యూటీఎఫ్ నియోజకవర్గ స్థాయి టాలెంట్ టెస్ట్




**వింజమూరు, జనవరి 4, ప్రభాతవార్త :** యూటీఎఫ్ వింజమూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయగిరి నియోజకవర్గ స్థాయి పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థుల టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 41 పాఠశాలల నుండి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో మొదటి పది స్థానాలు పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు నగదు, మెమోంటో బహుమతులు అందజేయడం జరిగింది. మొదటి రెండు స్థానాలు జడ్పీహెచ్ఎస్ వింజమూరు తృతీయ స్థానం బ్రాహ్మణ కాక, నాలగవ స్థానం జలదంకి ఐదవ స్థానం బ్రాహ్మణ క్రాక ఆరవ స్థానం జలదంకి ఏడవ స్థానం ఏపీ మోడల్ స్కూల్ దుత్తలూరు 8వ స్థానం గుండె మడకల తొమ్మిదవ స్థానం జడ్పీ బాయ్స్ వింజమూరు పదవ స్థానం బ్రాహ్మణ కాక విద్యార్థులు బహుమతులు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం, జిల్లా మాజీ వైద్య అధికారి డాక్టర్ మాశిలామణి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ మాలకొండయ్య, వివేకానంద విద్యాసంస్థల అధినేత గోపాల్‌రెడ్డి, యూటీఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బాబురెడ్డి, జిల్లా నాయకులు చలపతి శర్మ, వివి శేషులు, మండల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ ఇటువంటి అవకాశాలను వినియోగించుకుని విద్యార్థినీ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని తెలియజేశారు.

## హత్యాయత్నం కేసు నమోదు

**నెల్లూరు క్రైమ్, జనవరి 4, ప్రభాతవార్త :** ఇద్దరి మధ్య జరిగిన ఘటనను రాజి చేసేందుకు వెళ్లిన మహిళపై మరో మహిళ అత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సంతపేట పోలీస్ స్టేషన్లో ఆదివారం హత్యాయత్నం కేసు నమోదు అయింది. వివరాల్లోకి వెళితే స్థానిక ఉప్పరపాలెం కు చెందిన పక్కపక్కన నివాసం ఉంటున్న రాజేశ్వరి, కీర్తిల నడుమ డ్రైనేజ్ విషయంలో తరచూ గొడవలు జరుగుతుండేది. ఈ క్రమంలో ఆదివారం వారిద్దరి మధ్య గొడవ జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న కృష్ణవేణి అనే మహిళ సర్దుబాటు చేసే ప్రయత్నం చేసింది. దీంతో ఆగ్రహించిన కీర్తి ఆమెపై దాడికి పాల్పడి చేతి వేలిని కొరికింది. దీంతో ఆమె సంతపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు బయలుదేరింది. రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఆమెను మరోసారి అడ్డగించిన కీర్తి బ్లేడుతో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసింది. గాయాల పాలైన ఆమె పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయగా సంతపేట పోలీసులు కీర్తి పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

## మేజర్ పంచాయతీల్లో దోమల బెడద

**బిట్రగుంట జనవరి 4 ప్రభాతవార్త :** బోగోలు మండలంలోని బోగోలు, విశ్వనాధరావుపేట పంచాయతీలలో దోమల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో దోమల బెడద నివారణకు ఈ పంచాయతిల్లో ఫాగింగ్ మిషన్‌లు కూడా వినియోగించేవారు. ప్రస్తుతం వాటిని ఉపయోగించకూడా నిరూపయోగంగా ఉన్నాయి. తక్షణమే అధికారులు స్పందించి దోమలబెడద నివారణకు వీటిని ఉపయో గించాలని లేనిపక్షంలో దోమల బెడద వల్ల వచ్చే అనార్ధలకు తాము బలిఅవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హిందుత్వాన్ని కాపాడాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది



**కలిగిరి,జనవరి04, ప్రభాతవార్త ;** ప్రతి హిందువు తప్పకుండా గుడులకు, దేవాలయాలకు వెళ్లాలని వారితోపాటు మిగిలిన వారినికూడా తీసుకు పోవాలని బ్రహ్మశ్రీ శ్రీరామాయణంమహేష్ స్వామీజీ,శ్రీ ఆత్మా నంద స్వామీజీలు తెలిపారు. మండల కేంద్రమైన కొండాపురంలో శిందూ సమ్మేళనా కార్యక్రమం ఆదివారం జరిగింది. రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్‌యస్‌యస్)స్థాపించి100సంవత్సరాలు పూర్తయిన సంద ర్భంగా శతాబ్ది ఉత్సవాలలో బాగంగా ఈ కార్యక్రమం కొండాపురంలో నిర్వహించడం జరిగింది.రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్తాపించిన ఈవంద సంవత్సరాల ప్రయాణంలోఎన్నో ఆటుపోట్లు, వడిదుడుకులు తట్టుకొని నిరంతరం విజయం వైపు పయనిస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి ముక్య అతిదులుగా పాల్గున్న అతిదులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా తయారై హిందూ సమాజానికి దిక్సూచిగా పనిచేస్తూ ప్రతి హిందువు బందువునూ హిందూ సమాజంవైపు పయనించమని తట్టిలేపుతున్న సంస్థ రాష్ట్రీయ హిందూ సమ్మేళన సంస్త అన్నారు. ఇలాంటి సంస్థలో పనిచేస్తున్నందుకు ప్రతి హిందువూ సగర్వంగా ముందుకు పోవాలన్నారు.అదేవిదంగా ముందుగా మనం గుడులకు, దేవాలయాలకు వెళ్లాలని అక్కడ ఉన్న పవిత్రతను అందరికీ పంచాలని తెలిపారు. మిందువులు ఇతర మతాల పట్ల ఆకర్షితులు కాకుండా హిందూ సమాజాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీలలితాబరద్వాజ దత్త ఫీఠాదిపతులు,శ్రీ శివరామ దత్తసాయిపీఠాధిపతులు, విహెచ్‌పి జిల్లా అధ్యక్షులు ఉప్పుటూరు కొండపనాయుడు,ఆర్‌యస్‌యస్ జిల్లా విబాగ్ ప్రచారక్ నవీన్,ర్‌యస్‌యస్ కార్యకర్తలు, హిందుబందువులు పాల్గొన్నారు.

## నేడు వికసిత్ భారత్ గ్రామ సభలు

**కలిగిరి, జనవరి04, ప్రభాతవార్త;** కలిగిరి మండలంలోని 23పంచాయితీలలో నేడు(మంగళవారం) ప్రభుత్వం వారు తలపెట్టిని వికసిత భారత్ రోజ్‌గార్,మరియు అజీఇక మిషన్ ( గ్రామీణ)కొరకు యాక్ట్ 2025 మరి యు స్వచ్చరహితగ్రామాల కొరకు కలిగిరి మండలంలోని 23పంచాయితీలల అధికారులు నిర్దేసించిన సమ యాలలో గ్రామ సభలు నిర్వహించాలని కలిగిరి యంపిడిఓ ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు.కలిగిరి మండలంలోని పంచాయితీలకు 2026 ; 27ఆర్థిక సంవత్సరానికి సంభందించి గ్రామ పంచాయితీ ప్రణాళికలుతయారు చేయుటకు,గ్రామ సబలు నిర్వహించాల్సిందిగా యంపిడిఓ తెలిపారు.

## రాపూరులో కురుగొండ్ల రామకృష్ణ యూత్ క్రికెట్ పోటీలు



**రాపూరు,జనవరి04ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మోగా టి.10 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించున్నట్లు నిర్వాహకులు తిరుపతి పార్లమెంట్ వాణిజ్య కార్యదర్శి తిక్కమనేని ప్రసాద్ నాయుడు, రాపూరు పట్టణ టిడిపి ఆధ్యక్షుడు ఏదోటి కోటి నాయుడులు తెలిపారు. ఈ పోటీలు జనవరి 9వ తేది నండిడి నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటిలలో పాల్గోనే వారు ఈ నెల 7వ తేది లోపు ఎంట్రీ పీజు చెల్లించి వారి పేర్లు నమొదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన టీమ్‌లకు ప్రధమ బహుమతి రూ. 30,116లు, ద్వితీయ బహుమతి రూ. 20.116లు ఆందజేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఉత్సాహవంతులైన యూవత ఈ క్రికెట్ పోటీలలో పాల్గోనాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెం.9866746345లో సంప్రదించాలన్నారు.

## రాపూరులో పేకట ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

### ..రూ.10,400 నగదు స్వాధీనం



**రాపూరు,జనవరి04ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని కొత్తపేటలోని ఒక దగ్గర పేకాట ఆడుతున్నారన్న సమాచరంతో రాపూరు ఎస్ఐ యం. వెంకట రాజేష్ ఆదివారం సాయంత్రం తన సిబ్బందితో దాడులు నిర్వహించి పేకట ఆడుతున్న 7 మంది వ్యక్తులను రూ. 10,400 రూపాయిల నగదును స్వాదీన పరుచుకున్నారు. ఈ సందర్బంగా ఎస్ఐ వెంకట రాజేష్ మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలైన కోడి పందేలు, పేకాట వంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే అట్టివారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేకమైన అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే ప్రజలు తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రాపూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది వున్నారు.

## చెన్ను బాలకృష్ణా రెడ్డి మోమోరియల్ సంక్రాంతి క్రికెట్ పోటీలు



**బొజ్జనపల్లి(రాపూరు), జనవరి04ప్రభాతవార్త :** రాపూరు మండల ప్రజా పరిషత్ ఆధ్యక్షుడు స్వర్గీయ చెన్ను బాలకృష్ణా రెడ్డి మోమోరియల్ సంక్రాంతి క్రికెట్ పోటీలను జనవరి నెల 10వ తేది నుండి నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ మూరంరెడ్డి వినయ్ కుమర్ రెడ్డి తెలిపారు. ఆసక్తి వుండి పోటీలలో పాల్గోనే క్రికెట్ టీమ్‌లు ఈ నెల 9వ తేది లోపు ఎంట్రీ పీజు చెల్లించి వారి జట్టు పేర్లు నమొదు చేసుకోవాలని కోరారు. ఈ పోటీలలో గెలుపొందిన టీమ్‌లకు ప్రధమ బహుమతి రూ. 15 వేలు, ద్వితీయ బహుమతి రూ. 10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రికెట్ టీమ్‌లు వినయ్ కుమర్ రెడ్డి సెల్ నెం.9491755294లో సంప్రదించాలని కోరారు.

## కలువాయిలో హిందూ సమ్మేళనం



**కలువాయి జనవరి 4ప్రభాతవార్త :** మండలకేంద్రమైన కలువాయిలో శ్రీ చెన్నకేశవస్వామి దేవస్ధానం నందు హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆర్ఎస్ ఎస్ సహప్రాంత కళాశాల ప్రముఖ్ వేములపాటి రవి, విశ్రాంత అధ్యాపకులు కృష్ణారెడ్డి, లక్ష్మీ నరసిం హ స్వా మి దేవస్థానం వ్యవస్థాపకులు నరసయ్యాస్వామి,టి అరు ణకుమారిలు పాల్గోన్నారు .కార్యక్రమాన్ని ఉద్దే శించి వక్తలు మాట్లాడుతు హిందూవులందరు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.హిందూవులు సంఘ టితం కాకుంటే భవిష్యత్తులో ప్రమాదకర పరిస్తితులు ఎదురౌతాయని అన్నారు. హిందువులు కులా లుగా, రాజకీయాలలో విడి పోయిన వారు ఏకం కావాల్సి న సమయం ఆసన్నమైందని అన్నారు. ఈదేశంలో హిం దూవులు మెజార్టీగా ఉంటు మైనార్టీలుగా రాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా నిర్వహించిన కార్యక్రమాలలో లలితా పారా యణ బృందం సభ్యులుపారాయణం నిర్వహి ంచారు.అలాగే గీతా పారాయణం పందరి భజనలు కోలాటం కర్రస్వాము తదితర కార్యక్రమాలు నిర్వహి ంచారు.ఈకార్యక్రమంలో సమరసత సేవా పౌండేషన్ ,కలు వాయి హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గోని జై శ్రీరామ్ నినాదాలతో ప్రాం గణం మారు మ్రోగింది.

## వైభవం శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి పుష్యపౌర్ణమి గరుడసేవ



**బిట్రగుంట జనవరి 4 ప్రభాతవార్త :** బోగోలు మం డలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంక టేశ్వ రస్వామి పుష్యపౌర్ణమి గరుడసేవ శనివారం రాత్రి వైభవం గా జరిగింది. ఉభయకర్తల సహ కారం తో ఈ ఉత్సవం నిర్వహించడం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ప్రతి పౌర్ణ మికి గరుడసేవ ఉత్సవం నిర్వహి స్తుండడం తెలిసిందే.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**నెల్లూరు క్రైమ్, జనవరి 4, ప్రభాతవార్త :** అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య యత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఘటన నగరంలోని చైతన్యపురి కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికంగా నివాసం ఉండే ధనమ్మ (75) అనే మహిళ అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ తాను ఆత్మహత్య చేసుకుని చనిపోతాను అంటూ కుటుంబ సభ్యులకు తరచూ చెప్పేది. వారు ఓదార్చే ప్రయత్నం చేస్తూ వచ్చారు. అయితే మూడు రోజుల కిందట ఇంట్లోని స్నానాల గదిలో ఉన్న యాసిడ్‌ను ధనమ్మ తాగింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మరణించారు. ఈ ఘటనపై ఆమె కుమారుడు మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు వేదయపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## గ్రామదేవత అంకమ్మకు ప్రత్యేక పూజలు



**విడవలూరు, జనవరి4ప్రభాతవార్త :** గ్రామదేవతగా వెలసియున్న అంకమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు,కుంకుమ అర్చన చేశారు. అలాగే వివిధ రకాల పండ్లు పూలతో అలంకరించడంతో భక్తులకు అమ్మవారు దుర్గదేవి రూపంలో దర్శన మి చ్చారు. అనంతరం అమ్మ వారిని ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో భకు ్తలు పల్లకి సేవ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొనుటకు భక్తితో పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భజన భక్తమండలి వారిచే భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమాలకు ఉభ యకర్తలుగా ఆలయ సేవకులు వ్యవహరించారు.

## ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం



**నెల్లూరు, జనవరి 4, ప్రభాతవార్త – వైద్యం :** ఆదివారం విద్యుత్ భవన్ నందు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల నుండి నేరుగా సమస్యలను స్వీకరించి వాటిని సత్వరంగా పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 8.30గంటల నుండి 9.30గంటల వరకు వినియోగదారులు 0861-2320427 నెంబర్‌కు ఫోన్ చేసి తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు నేరుగా తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రహదారి ఇరువైపులా మొక్కల తొలగింపు



**వింజమూరు, జనవరి 4, ప్రభాతవార్త :** స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ వింజమూరు కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాలు చేపట్టామని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కే.రామారావు పేర్కొన్నారు. ఆదివారం పంచాయతీ పరిధిలో పలు ప్రాంతాలలో జేసీబీ సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయటం జరుగుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు విధిగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని చేయటం ద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని అన్నారు. అందులో భాగంగానే శనివారం ఫాగింగ్ కార్యక్రమాన్ని సర్పంచ్ నల్లొండ సృజన ఆధ్వర్యంలో ప్రారంభించామన్నారు. పంచాయతీలో దోమలు వృద్ధి కాకుండా నియంత్రణ చేపట్టడం జరుగుతుందన్నారు. వింజమూరు పంచాయతీని స్వచ్ఛ పంచాయతీగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పెన్షన్ దారులు తమ లైఫ్ సర్టిఫికేట్లను అందజేయాలి

**వింజమూరు, జనవరి 4, ప్రభాతవార్త :** పెన్షన్ తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ దారులు సర్వీస్ పెన్షనర్లు ఫ్యామిలీ పెన్షనర్లు తమ పెన్షన్ పొందేందుకు అవసరమైన లైఫ్ సర్టిఫికేట్లను అందజేయాలని పెన్షన్ దారుల సంఘ సభ్యులు భృంగి సుధాకర్ తెలిపారు. పెన్షన్ పొందుతున్న వారు ఫిబ్రవరి 28వ తేదీ లోపు తాము జీవించి ఉన్నట్లు తెలిపే ధృవపత్రాన్ని అందజేయాలన్నారు. ఈ పత్రాన్ని నెల్లూరులోని ట్రెజరీ కార్యాలయంలో కానీ అలా వీలు కాని వారు కావలి నెల్లూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో అందజేయవచ్చన్నారు. ఆధార్ కార్డ సెల్‌ఫోన్ సీపీవో నెంబర్ బ్యాంకు అకౌంట్ నంబర్ తప్పక తీసుకుని వెళ్లాలని తెలిపారు. గడువు లోపల అందజేయని వారికి తదుపరి నెల నుండి పెన్షన్ నిలిపివే యబడు తుందని, కావున పెన్షన్ దారులు సకాలంలో ధృవపత్రాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోసు కామాక్షయ్య తదితరులు పాల్గొన్నారు.

## రహదారి మార్గాన్ని మరమ్మత్తులు చేయించండి



**వింజమూరు, జనవరి 4, ప్రభాతవార్త :** వింజమూరు మండలం చాకలి కొండ గ్రామానికి వెళ్లే రహదారి మార్గం గుంతలమయమై వాహన దారులకు ప్రజలకు అసౌకర్యంగా తయారైంది. ఈ రహదారి మార్గాన్ని మరమ్మత్తులు చేయించడం లేదా నూతన మార్గాన్ని ఏర్పాటు చేయడం చేయాలని ఆయ గ్రామస్తులు విన్నవించుకుంటున్నారు. వింజమూరు నుండి చాకలి కొండ వెళ్లే రహదారి బత్తినవారిపల్లి గ్రామానికి దిగువ నుండి మూడు కిలోమీటర్లు తారు రోడ్డు గుంతలమయమై ఇబ్బందికరంగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. అడుగడుగునా గుంతలతో ద్విచక్ర వాహనాలు గాని కార్లు, ట్రాక్టర్లు ప్రయాణించాలంటే ఇబ్బందికరంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉండవని వాహన దారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి ఆ మార్గాన్ని మరమ్మత్తులు చేయించి లేదా నూతన మార్గాన్ని మంజూరు చేయించి ప్రజలకు సౌకర్యవంతం చేయాలని బతినివారిపల్లె చాకలికొండ గ్రామస్తులు విన్నవించుకుంటున్నారు.

## నేడు ఎంపీపీ ఎన్నిక

**వింజమూరు, జనవరి 4, ప్రభాతవార్త :** వింజమూరు మండల పరిషత్ అధ్యక్ష పదవికి నేడు ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నారు. మాజీ ఎంపీపీ ఇనగలూరి మోహన్‌రెడ్డిని తొలగిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ గ్రామీణ అభివృద్ధి శాఖ ఈనెల 21వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది అక్టోబర్ 31వ తేదీన ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంలో 12 మంది ఎంపీటీసీలకు 11 మంది హాజరయ్యారు. వారిలో ముగ్గురు ఎంపీటీసీలు ఓటింగ్ పాల్గొనలేదు. మిగిలిన 8 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ అవిశ్వాస తీర్మాణానికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులు ప్రభుత్వానికి పంపడంతో ప్రభుత్వం పరిశీలించి మోహన్‌రెడ్డిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం డిసెంబర్ 28న ఇన్‌చార్జి ఎంపీపీగా ఆనంగి రమణయ్య బాధ్యతలు చేపట్టారు. అదే రోజు జనవరి 5న ఎన్నిక ప్రక్రియ నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జడ్పీ సీఈఓ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 1వ తేదీన మండల పరిషత్ సభ్యులకు అధ్యక్ష పదవి ఎంపిక సంబంధించి నోటీసులు జారీ చేశారు. 2,3 తేదీలలో వైసీపీ నేతలు, ఎంపీపీ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే ఉద్దేశంతో వారికి సంబంధించిన ఎంపీటీసీలను క్యాంపులకు తరలించారు. అలాగే ఎంపీపీ పదవి ఆశిస్తున్న వనిపెంట హైమావతి భర్త సుబ్బారెడ్డి తన వర్గానికి చెందిన ఎంపీటీసీలను క్యాంపు తరలించారు. నేడు జరిగే ఎపీపీ ఎన్నిక ఉత్కంఠ భరితంగా మారింది. మండలంలో 12 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరిలో వింజమూరు పంచాయతీ పరిధిలో ఆరుగురు రూరల్ పరిధిలో మరో ఆరుగురు ఎంపీటీసీలు ఉన్నారు. టీడీపీకి చెందిన వనిపెంట సుబ్బారెడ్డి వర్గంలో మెజార్టీ ఎంపీటీసీలు ఉన్నట్లు సమాచారం. వైసీపీ నేతలు ఎంపీడీవోను కలిసి తమ పార్టీ విప్‌ను జారీ చేశారు. ఎంపీపీ పదవికి ఏడూరు ఎంపీటీసీలు మద్దతు అవసరం ఉంది. గత రెండు రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపధ్యంలో ఓటింగ్లో పాల్గొనే ఎంపీటీసీలు ఏ క్షణాన ఎటువైపు వెళ్తారో తెలియని అయోమయ పరిస్థితులో నేతలు ఉన్నారు. ఈ ఎన్నికను కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారం మండలాల్లోనే తహసీల్దార్లకు బదలాయింపు

**కోట,జనవరి 4 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా రెవిన్యూ సమస్యలు పేరుకుపోతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. స్దానికంగా పరిష్కరిచుకనేలా జిల్లా స్దాయి నుంచి మండల స్దాయి అధికారులకు అధికారాన్ని బదలాయించింది. దీంతో గ్రామాలకు అందుబాటులో ఉన్న మండలాల్లో చాలా వరకు సమస్యకు విరుగుడు వీలు కలిగినట్లయ్యింది.ఇప్పటి వరకు జాయింట్ కలెక్టరు వద్ద ఉన్న 17 రకాల సమస్యల పరిష్కార అధికారాన్ని తహసీల్దార్లు,ఆర్డీవోలకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఇనాం,22ఎ భూములకు సంబధించిన సమస్యలే ఎక్కువగా వస్తున్నాయి.వెంకన్నపాళెంలో ఈ సమస్య చాల కాలం నుంచి ఉంది. వీటికి సంబంధించి రైతులకు హాక్కులు కల్పించాలి ఉంది. జేసి నుంచి తహసీల్దారు కు పది అధికారాలు బదిలీ కానున్నాయి, కోర్టు ఆదేశాలతో చేయాల్సిన మార్పులు, అన్యాక్రాంత భూమి, భూ సేకరణ, కేటాయింపులు, మాజీ సైనికోద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధులకు భూమి ఇవ్వడం, ఆధార్ అనుసంధానం ,భూ మార్పిడి, వంటివి ఉన్నాయి. ఒక రైతుకు ఖాతాలు ఎక్కువ ఉంటే వాటిని సరిదిద్దడం, నకిలీ సర్వే నంబర్లు తొలగింపు వంటి అధికారులను కల్పించనున్నారు.ఆ మేరకు స్దానిక శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ కూడా ఈ విషయాన్ని కోటలో జరిగిన రైతు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణి కార్యక్రమంలో ఈ విషయాన్ని చెప్పారు.

## ఇకనైనా మారండి



**కోవూరు, జనవరి 4 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కేడీలుగా, అనుమాతులుగా, రౌడీలుగా రికార్డుకెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకోవాలని కోవూరు ఎస్సై ఖదిర్‌బాషా తెలిపారు. జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం కోవూరు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో రౌడీ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ విధంగా రికార్డుకెక్కిన వారు ఇకనైనా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సత్యనారాయణ, పోలీసులు ఉన్నారు.

## బుద్ధవిహార్ నందు దమ్మ ప్రవచన ప్రభోధ కార్యక్రమం




**కావలి, జనవరి 4 ప్రభాతవార్త :** కావలి అంబేద్కర్ నగర్‌లోని బుద్ధ విహార నందు ఆదివారం బుద్ధ, దరమ్మ సంఘం వందన స్వీకరణ కార్యక్రమం జరిగింది. అనంతరం దమ్మ ప్రవచన ప్రబోద కార్యక్రమాన్ని బౌద్యాచార్యులు సంఘజ్యోతి ప్రబోదించారు. బౌద్ధ సూత్రం పఠన సాధన కార్యక్రమం దమ్మ ప్రవచన ఒకటవ అధ్యాయం ఒకటో భాగం 17వ అంశం వీడ్యోలు వచనాలు సిద్దార్థుడు తల్లిదండ్రులతో కడసారి కన్నీటి మంతనాలు ఒకటి నుంచి పది వచనాలను ప్రభుపుదించడం జరిగింది. సంఘ ప్రవచనం పూజల జయప్రకాష్ ప్రబోదించారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ క్యాలెంటర్ మరియు డైరిని ఆవిష్కరించారు. జనపదం ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉపాసిక, ఉపా సకులు కావలి జీవన్‌బోధి, పూజల మమత మరియు విహార్ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## రాయలసీమ ద్రోహి సిఎం చంద్రబాబు



**కోట,జనవరి 4 ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని రాయలసీమ ప్రాంతాన్ని సీఎం చంద్రబాబు దారుణంగా దెబ్బతీసి మరణ శాసనం లిఖించారని వైకాపా ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్వీ.వి. సుబ్రమణ్యంరెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం కోటలో విలేకరులతో మాట్లాడారు. సీమ ప్రాంతాన్ని ఎడారి చేసేందుకు చంద్రబాబు చేసుకున్న ఒప్పందం బట్టబయలైందని చెప్పారు. స్వార్ధ ప్రయోజనాల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను చంద్రబాబు బలి పెట్టారని ఆయన మండి పడ్డారు. నేను కోరినందువల్లే చంద్రబాబు రామలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఆపేశారని తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక విషయాలను వెల్లడించారని సుబ్రమణ్యం రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు ఎపీ ప్రజల హాక్కులపైన దొంగచాటుగా దెబ్బ తీశారని ఆయన విమర్శించారు. ఇంతటి అన్యాయం చేసిన చంద్రబాబును ప్రజలు ఎట్టి పరిస్దితుల్లోనూ క్షమించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.జగన్‌మోహన్ రెడ్డి రాయలసీయకు తాగు,సాగు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాయలసీమకు లిఫ్ట్ ఇరిగేషగేన్ తీసుకొస్తే చంద్రబాబు తన స్వార్థం కోసం ఆప్రాజెక్టలను ఆపేసి రాయలసీమకు తీరని అన్యాయం చేశారని సుబ్రమణ్యంరెడ్డి మండి పడ్డారు.

## అబ్దుల్ అజీజ్‌ను కలిసిన దర్గా పీఠాధిపతి



**ఆత్మకూరు,జనవరి4,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్ షేక్ హాజీ అబ్దుల్ అజీజ్‌ను ఆదివారం నెల్లూరులో అనంతసాగరం మష్కూర్ అలీషా ఖాదరి దర్గా పీఠాధిపతి సయ్యద్ సానిసాహెబ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్‌ను శాలువాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆస్థానే మష్కూర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నెల్లూరు జిల్లా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జపాన్ షబ్బీర్, షాహుల్ , గౌస్‌అలీషా తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లోకి డ్రైనేజి



**కోట, జనవరి 4 ప్రభాతవార్త :** కోట ఆర్టీసీ బస్టాండు చుట్టుపక్కల నివాసం ఉండే ప్రజలు డ్రైనేజిని ఆర్టీసీ ప్రాంగణంలోకి వదలడంతో దుర్వాసనకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆ మురికి కాలువలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అంతేకాకుండా ఆ డ్రైనేజీ నీరంతా సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లడంతో మరోపక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తుంటే ఈ మురికి నీళ్లతో అవస్థలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. పంట పొలాల్లోకి వెళ్లాలంటే దుర్వాసన వెదజల్లుతుందన్నారు. ఇటు మురికి నీళ్లతో పంట దిగుబడి కూడా తగ్గిపోతోందన్నారు. కోటలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు కాస్త శ్రద్ధ పెట్టి రైతుల పంట పొలాల్లోకి మురికినీరు వెళ్లకుండా చూడాలని కోరుతున్నారు.

## విపిఆర్ నేత్రను ప్రజలందరు సద్వినియోగం చేసుకోండి




**సీతారామపురం జనవరి 4 ప్రభాతవార్త :** గత కొద్ది రోజులుగా సీతారామపురం మండలంలో ని గ్రామ గ్రామన విపిఆర్ పౌండేషన్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరం విపిఆర్ నేత్రను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సీతారామపురం గ్రామ టిడిపి అద్యక్షులు పిడుగు రమేష్ పేర్కున్నారు. సోమ,మంగళవారాలలో మండలకేంద్రమైన సీతారా మపురంలో విపిఆర్ నేత్ర కార్యక్రమం జరుగుతుందని కావున మండలంలో కంటి సంబందిత సమస్యలు ఎదుర్కుంటున్న ప్రజలందరు విపిఆర్ నేత్రలో పాల్గోని ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకొని అదునా తమైన అదికనాణ్యత ప్రమాణాలు కలిగిన కంటి అద్దాలను పొందాలన్నారు.

## బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల 2000- 2005 పూర్వ విద్యార్దుల సమ్మేళనం



**బుచ్చి జనవరి 4 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల 2000-2005 పూర్వ విద్యార్దుల సమ్మేళనం ఆదివారం కోలహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్దులందరు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకొన్నారు. యోగ క్షేమాలు అడిగి తెలుసు కున్నారు. పాటజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో గురువులను కూడా పిలిచి వారిని సత్కరించారు. ఈకార్యక్రమంలో భవానీ, సుష్మ, రేష్మ, మానస, చైతన్య, అనూహ్య, సుకర్షణ, సుప్రజ, వారి మిత్ర బృందం పాల్గోన్నారు.

## స్వగ్రామ స్మృతులను గుర్తు చేసుకున్న అరబిందో ఫార్మసీ అధినేత మదన్ మోహన్‌రెడ్డి



**దగదర్తి, జనవరి 4, ప్రభాతవార్త :** ప్రముఖ పారిశ్రామిక వేత్త అరబిందో ఫార్మసీ అధినేత మెట్టు మదన్ మోహన్‌రెడ్డి వారి సతీమణి వాణిలతో కలిసి స్వగ్రామమైన దగదర్తి మండలం శ్రీరామాపురం గ్రామానికి ఆదివారం విచ్చేశారు. గ్రామంలో వారి చిన్న నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నెల్లూరు వీఆర్‌సీ కళాశాలలో విద్యను అభ్యసించిన మిత్రుల కుటుంబ సభ్యులతో కలిసి వారి స్వగ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో కలిసి పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో వెలసి ఉన్న శ్రీ దేశాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వగ్రామానికి మిత్రులతో కలిసి రావడం సంతోషంగా ఉందన్నారు.

## ప్రేమ అంటూ యువతిని మోసం చేసిన యువకుడికి జైలు శిక్ష



**ఉదయగిరి, జనవరి 4, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలో యువత ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని జైలుకు పంపినట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. సీతారాంపురం మండలంకు చెందిన యువతిని మండలం బోడబండ ఎస్సీ కాలనీకి చెందిన అఖిల్ ప్రేమ పేరుతో మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితున్ని అరెస్టు చేసి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. న్యాయవాధికారి జే.అంజయ్య నిందితుడికి రిమాండ్ విధించారు. దీంతో నిందితున్ని ఆత్మకూరు సబ్ జైలుకు తరలించారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కారం



**కొడవలూరు, జనవరి 4 ప్రభాతవార్త :** సోమవారం జరిగే ప్రజా సమస్యల ప్రజావేదిక పరిష్కార కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగును మండల ప్రజలు, రైతులు స్వచ్ఛందంగా సమస్యలను తెలిపి పరిష్కారం చేసుకోవచ్చని అని తహశీల్దారు కె. స్ఫూర్తి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి పలు శాఖ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు హాజరవుతారు. ప్రజలు, రైతులు వారి సమస్యలపై విన్నతలు అందజేసి పరిష్కారం చేసుకోవాలని కోరారు. సోమవారం ఆలూరుపాడు, రామన్నపాలెం గ్రామాలలో పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు ఇవ్వడం జరుగుతుంది ఆమె తెలిపారు.

## ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జనవరి 4 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 5న సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీనిని ఆయా పాఠశాలలో ఆధార్ లేని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివా సులు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేది ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 7వ తేది కోవూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల లోనూ.. 9వ తేది జేబీఆర్ ఉన్నత పాఠశాలలోనూ , డిజిటల్ అసిస్టెంట్ డి. సూ ర్యకళ ఆధ్వర్యంలో ఈ ఆధార్ కేంద్రాలు జరుగుతాయన్నారు. అదేవిధంగా గుమ్మలదిబ్బ పాఠశా లలో ఈ నెల 5,6 తేదీల్లో పాటూరు పాఠశాలలో 7,8 తేదీల్లో డిజిటల్ అసిస్టెంట్ వినీల పర్యవేక్షణలో జరుగు తాయని, ఆయా పాఠశాలలోని విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేషన్ చేసుకోవాలని ఈ సందర్భంగా సూచిం చారు.– **నేడు గ్రామ సభలు** కోవూరు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 5వ తేది సోమవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, అన్ని పంచాయతీల కార్యదర్శులు వారి వారి పంచాయతీల్లో ఈ గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో తెలిపారు. ఈ గ్రామ సభల్లో చెత్తరహిత గ్రామ పంచాయతీలుగా తీర్మాణం చేయడం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ రోజ్‌ఘర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ



**కోవూరు, జనవరి 4 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన చర్చి అయిన శారాబిలాక్ మెమోరియల్ చర్చిలో ఆదివారం నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ మాజీ కార్యదర్శి కలిచేటి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో తన తల్లి ప్రిస్కిల్లమ్మ జ్ఞాపకార్థం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి రాజేష్, దివ్య రాజేష్, తదితరులు ఉన్నారు.

## గిరిజన పిల్లలకు బట్టలు పంపిణీ చేసిన సిపిఎం 31 డివిజన్ శాఖ



**నెల్లూరు,జనవరి4 ప్రభాతవార్త–విద్య :** 31వ డివిజన్ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో, సురేంద్ర పెంచలయ్య సహకారంతో అంబాపురం అరుంధతివాడలోని బ్రహ్మంగారి గుడి పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న దళిత, గిరిజన నిరుపేద పిల్లలకు బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 100 మంది నిరుపేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 31వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి బి. నాగేశ్వర్ రెడ్డి, సిఐటియు రూరల్ అధ్యక్షులు ఎం. సుధాకర్ మాట్లాడుతూ, అంబాపురం అరుంధతివాడలో మరియు గిరిజన ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు ఎక్కువగా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబాలని తెలిపారు. పండగల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో, కనీసం కట్టుకునేందుకు బట్టలు కూడా లేని పరిస్థితుల్లో ఉన్న పిల్లలకు దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రాంత ప్రజలకు నిత్యావసర వస్తువులు, ముఖ్యంగా బియ్యం వంటి సరుకులు పంపిణీ చేసేందుకు మరింతమంది దాతలు ముందుకు రావాలని వారు కోరారు. అలాగే పండగల సందర్భంగా ప్రభుత్వం దళిత, గిరిజన కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. అనేక కుటుంబాలకు ఇప్పటికీ సొంత ఇల్లు లేకపోవడం బాధాకరమని, ప్రభుత్వం వెంటనే వీరికి గృహాలు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు కండే కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, నాగా సురేందర్ రెడ్డి, పెంచలయ్య, ఆదిలక్ష్మి ్మ, పవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య



**అల్లూరు, జనవరి 4 ప్రభాతవార్త :** అల్లూరు హరిజనవాడకు చెందిన చిట్టేటి చందన(34) ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. అల్లూరు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి వివరాల మేరకు భార్యాభర్తలు గొడవ పడడంతో మనస్తాపం చెందిన చందన బెడ్‌రూమ్‌లో ఉరివేసుకొని మృతి చెందింది. సంఘటనా స్థలానికి వెళ్ళి పోలీసులు పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

## పొదుపు మహిళలకు పెరటికోళ్ళు పంపిణీ



**సంగం జనవరి 4 ప్రభాతవార్త :** సంగం మండలంలో పొదుపు మహిళలకు పెరటికోళ్ళు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో ఎపిఎం రవిశంకర్‌రెడ్డి, వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కోళ్ళతోపాటు వాటికి మందులు కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. కోళ్ళ ఆహారంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రధానంగా రేషన్ బియ్యం వాడకూడదని సూచిం చారు. ఈ కోళ్లను పెంచుకొని తద్వారా వచ్చి గుడ్లు ఆహారంగా తీసుకుంటే రక్తహీనత సమస్య తగ్గుతుందని అన్నారు. ఈ కోళ్ళను జాగ్రత్తగా పెంచాలని సూచించారు.

## కోడిపందాలు ఆడుతున్న ఐదుగురు అరెస్టు



**కావలి, జనవరి 4 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం కొండయ్యగారిపాలెంకు సమీపాన కోడిపందాలు ఆడుతున్న ఐదుగురిని ఆదివారం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగి ంది. రూరల్ పోలీసుల సమాచారం మేరకు రూరల్ సిఐ రాజేశ్వరరావు అందిన సమాచారం మేరకు సబ్ఇన్స్‌పెక్టర్ తిరుమలరెడ్డి వారి సిబ్బం దితో కలసి రూరల్ మండలం, కొండయ్య గారిపాలెం గ్రామ సమీపంలోని అమ్మగారి గుడి వద్ద ఖాళీప్రదేశంలో కోడిపందాలు ఆడుతుండగా రైడ్‌చేసి 5మందిని అదులోకి తీసుకొని వారినుంచి రూ.10,050, కోడిపుంజు ఒకటి స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈసందర్బంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో పేకాట, కోడిపందాలు, ఇతర అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## సత్యం పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కావలి, జనవరి 4 ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన విశ్రాంత విఆర్ఓ అన్నలూరు సత్యం గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదివారం పట్టణంలో 28వ వార్డు రాజావీదిలో ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యు లను పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు. సత్యం మృతి ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. వృత్తిలో అంకితభావంతో పనిచేసిన వ్యక్తిని కోల్పోవడం తీరని లోటుగా అభివర్ణించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించడం జరగిందన్నారు.

## మీ ఇంటి బిడ్డగా ఇచ్చిన బాధ్యతను నెరవేర్చుతున్నా



**నెల్లూరు రూరల్ జనవరి 4 ప్రభాతవార్త** నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నేడు 25వ డివిజన్ బుజబుజ నెల్లూరు ప్రాంతంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన స్మశానవాటిక ప్రహరీ గోడను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు తనను మూడు సార్లు భారీ మెజారిటీతో గెలిపించి తమ ఇంటి బిడ్డగా ఆదరించారని, ఆ నమ్మకానికి తగ్గట్టుగా తన శక్తి ఉన్నంతమేర నెల్లూరు రూరల్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 25వ డివిజన్ అభివృద్ధికి ఇప్పటికే ఐదు కోట్ల రూపాయల నిధులు కేటాయించామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మూడు ఫేజ్ విద్యుత్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, పండగ అనంతరం మిగిలిన పనులను ప్రారంభించి పూర్తిస్థాయిలో విద్యుత్ సదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికలు లేని సమయంలో ప్రజాసమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీల బేధం లేకుండా నెల్లూరు రూరల్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, స్థానిక కార్పొరేటర్ బద్దెపూడి నరసింహ గిరి, 25వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు బైనబోయిన శేషు యాదవ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నిత్యాన్నధానానికి రూ.1,00,116 విరాళం



**పెంచలకోన(రాపూరు),జనవరి 4పభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్యాన్నధానానికి రూ. 1,00,116 విరాళాన్ని స్వామి వారి భక్తులు ఆంద జేసినట్లు ఆలయ ఉపకమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డికి ఆదివారం తెలిపారు. నెల్లూరు జిల్లా, పోదల కూరు మండలం, చిట్టేపల్లి గ్రామానికి చెందిన మోదేపల్లి కృష్ణ ప్రసాద్, వారి ధర్మపత్ని రాధా గార్లు వారి కుమారుడైన మోదేపల్లి జయసింహా పేరుతో స్వామి వారి నిత్య అన్నదా నానికి సంబందించి రూ. 1,00,116 విరాళాన్ని అన్నదాన సత్రం సిబ్బందికి ఆంద జేశారు. స్వామి వారి అన్న ప్రసాదానికి విరాళం ఆందజేసిన దాతలకు స్వామి వారి చిత్రపఠాన్ని తీర్ధ ప్రసా దాలను, స్వామి వారి శేష వస్త్రాన్ని ఆలయ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పులగల నరసింహ తదితరులున్నారు.

## వేమిరెడ్డి అర్జున్ రెడ్డిని కలిసిన మత్స్యకార నాయకులు



**విడవలూరు,జనవరి4ప్రభాతవార్త:** కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కుమారుడు అర్జున్ రెడ్డిని విడవలూరు మండలం మత్స్యకారులు,ఐటిడిపి మండల అధ్యక్షులు శ్రీహరికోట రవిబాబు, కోవూరు నియోజకవర్గ మత్స్యకార అధ్యక్షులు ఆవుల రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి పండుగ సందర్భంగా ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రజలందరూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు జరుపుకునే సమయంలో జాగ్రత్తలు పాటించి కుటుంబ సభ్యులతో పండుగ వేడుకలు ఆనందంగా గడపాలని రవి పేర్కొన్నారు.

## మతమార్పిడి విధానాన్ని అడ్డుకుందాం
## హిందూ మతాన్ని కాపాడుకుందాం




**బుచ్చి జనవరి 4 ప్రభాతవార్త** భారతదేశంలో జరుగుతున్న మతమార్పిడి విధానాన్ని అడ్డుకోవాలని రామాయణం మహేశ్‌స్వామి పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జరుగుతున్న హిందూ సమ్మేళనం కార్యక్రమం బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీవివేకానంద ఇంగ్లీషుమీడియం స్కూల్ ప్రాంగణంలో జరగగా ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతు చిన్న తనం నుండి తల్లులు బిడ్డలకు హిందూ మతం గొప్పతనం, మన సాంప్రదాయం,సంస్కృతి గురించి తెలియజేయాలని సూచించారు. మనదేవుళ్ళు, సనాతన ధర్మం గురించి, భారతదేశం గొప్పతనం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు.అనంతరం సామాజిక సమరసతా వేదిక ప్రాంత మహిళా ప్రముఖ్ కోదూరు జయప్రద మాట్లాడుతు పాశ్చాత్యక పోకడలకు పోయి సాంప్రదాయాలు,వేషధారణలు మరిచిపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. మమ్మి,డాడి ,ఆంటి,అంకుల్ అనే పధాలను విడనాడి అమ్మ,నాన్నా,అన్న,అక్క, అత్తా,మామ,పిన్ని ,తాతా,అవ్వా అనే అప్యాతానుగాల పిలుపులను పిలవాలని ఆమె సూచించారు. లవ్ జీహాద్ మాయలో పడవద్దని ఆమె హెచ్చరించారు. అనంతరం ఆర్‌ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ రాళ్ళబండి నవీన్ మాట్లాడుతుమతమార్పిడి విధానాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని అన్నారు. కుటుంబ వ్యవస్థలను కాపాడుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు. హిందూమతం కి ఆది అంతం లేదని అందులోనుండి వచ్చేందే సనాతన దర్మం అని ఆయన పేర్కున్నారు. ప్రకృతిని పూజించే గొప్ప మతం హిందూ మతం అని ఆయన స్పష్టం చేశారు. కుటుంబం మొత్తం కలిసి వారానికొకసారి గుడికి వెళ్లాలని అన్నారు. సెల్‌ఫోన్లను పక్కనబెట్టి తల్లిదండ్రులు,పిల్లలు అందరు అప్యాయతగా గడపాలని సూచించారు.ఈకార్యక్రయమంలో భాగంగా సరస్వతీ శిశుమందిర్ మాతాజీ భక్తి గీతాన్ని ఆలపించారు.ఈకార్యక్రమంలో అక్కం రాజు మల్లిశ్వరీ రిటైర్డ్ తహసిల్దారు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఉపాధ్యాక్షులు కాసుల వెంకటరమణయ్య, ఖండ్ చాలక్ కేతిరాజు కేశవయ్య, ఆర్‌ఎస్ఎస్ విభాగ్ కార్యనిర్వహణ సభ్యులు బాలు సుబ్బారావు, పెట్లూరు కృష్ణయ్య ( హిందూ చైతన్య వేదిక ) , నేలనూత శ్రీదర్ , కెకె రాజగోపాల్ అపస్ జిల్లా అధ్యక్షులు , కెవి ప్రసాద్ , బిజెపి జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్,మాజీ అధ్యక్షులు రామిశెట్టి మోహన్,సీనియర్‌నాయకులు ఇనుగూరు బాలయ్య, రూరల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, రోశయ్య, బిజెపి జిల్లా నాయకులు గంజం పెంచలప్రసాద్, యోగా మాష్టార్ గుబ్బా లక్ష్మీనారాయణ ,పెద్దఎత్తున మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రూరల్ ఉపాధ్యాక్షులుగా గెంది పెంచలకృష్ణ



**బుచ్చి జనవరి 4ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలం రూరల్ బిజెపి ఉపాధ్యాక్షులుగా రెడ్డిపాళెం గ్రామానికి చెందిన గెంది. పెంచల కృష్ణను బిజెపి జిల్లా అధ్యక్షులు, మండల రూరల్ అధ్యక్షులు ఎంపిక చేశారు. పెంచలకృష్ణ గతంలో బిజెవైఎం మండల అధ్యక్షులుగా బిజెవైఎం జిల్లా కార్యదర్శిగా పనిచేసి వున్నారు. ప్రస్తుతం ఆయన్ని రూరల్ ఉపాధ్యాక్షులుగా ఎంపిక చేయడం పట్ల ఆయన మిత్రులు తదితరులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పెంచల కృష్ణ మాట్లాడుతు క్షేత్రస్దాయి నుండి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు.ఈ సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షులకు,మండల అధ్యక్షులకు,నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఎమ్మెల్యేను అభినందించిన ఎన్జీవో నేతలు



**కోవూరు, జనవరి 4 ప్రభాతవార్త :** కోవూరు తాలూకా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటేష్ , కార్యవర్గ సభ్యులు ఆదివారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిసి పుష్పగుచ్చంతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కోవూరు సబ్ ట్రెజరీ అధికారి కిరణ్‌కుమార్ ఉన్నారు.

## కెరియర్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌లో పీఆర్ఎన్ విద్యార్థుల ప్రతిభ

**- జిల్లా స్థాయి ప్రథమ స్థానం కైవసం**




**కోవూరు, జనవరి 4 ప్రభాతవార్త :** నెల్లూరులోని సెయింట్ పీటర్స్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి కెరియర్ ఎక్స్ పో ఎగ్జిబిషన్‌లో కోవూరు పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు అన్ని రంగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ కెరియర్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీ అండ్ వెల్‌నెస్ , ఐటీ విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచి మూడు విభాగాల్లోనూ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఇందుకు కృషి చేసిన ఒకేషనల్ ట్రైనర్స్ డి. నరేష్, ఐ. రజని ముఖర్జీ, ఆర్. శ్రావణిలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులను ఎస్ఎస్ఏ పీవో వెంకటసుబ్బయ్య మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

## జనహిత సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం



**నెల్లూరు,జనవరి4 ప్రభాతవార్త-విద్య**

పేద,అనాధ పిల్లల సంరక్షణ,విద్యాబుద్దులు నేర్పించటంలో జనహిత వాత్సల్య ఆశ్రమం నిర్వాహకులు చేస్తున్నసేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా వైద్యశాఖ అధికారిణి డాక్టర్ సుజాత పేర్కొన్నారు.ఆదివారం నగరంలోని స్థానిక వనంతోపు సెంటర్‌లోని జన హిత వాత్సల్య ఆశ్రమంలో ఆశ్రమం నిర్వహణ కార్యదర్శి జీవీ సాంబశివరావు ఆధ్వర్యంలో సిబ్బందికి నూతన బట్టల పంపిణీ, ఆశ్రమంలో ని విద్యార్థులకు, సిబ్బందికి ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆమెముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆశ్రమంలో ని 90 మంది పిల్లలని 15 మంది సిబ్బంది తమ సొంత పిల్లల్లా చూసుకోవటం సంతోషకరమన్నారు. విద్యార్థులకు చదువు చెప్పడంలో, మంచి అలవాట్లు నేర్పించటంతో వారిని ఉతమ పౌరులుగా తీర్చిదిద్దటంలో ఆశ్రమ నిర్వాహకులు జీవి సాంభశివరావు ఆదర్శప్రాయమన్నారు. తల్లి దండ్రులు లేని పిల్లలను ఐఐటి, ఎన్ఐటి స్థాయికి తీసుకువెళ్లిని ఘనత వీరికే దక్కుతుందని కొనియాడారు. జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాధర్ వల్లి ,జిల్లా ఎన్టీఆర్ ఆరోగ్యసేవ అధికారి డాక్టర్ సుధీర్‌లు మట్లాడుతు ఇక్కడ అద్యాపకులకు బట్టల పంపిణీ తోపాటూ చాగడం ట్రస్టు నిర్వాహకులు సర్గీయ లలితమ్మ భాస్కరరావు పేర్లమీద్ద సుమారు 120మందికి ఉచిత వైద్య, మెడికల్ టెస్టులను అందించటం సంతోషంగా ఉందన్నారు. సాంబశివరావును అందరూ ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఏపి హంసజిల్లా అధ్యక్షులు చేజర్ల సుదాకర్‌రావు మాట్లాడుతు గత ఆరు సంవత్సరాలుగా నిర్విరామంగా ఇక్కడ చిన్నారులకు బట్టలు, నిత్యావసరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఇందుకు తమకు సహకరించిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సిబ్బందికి మెడికల్ టెస్టులు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారిణి డాక్టర్ సుజాత, అదనపు వైద్య అధికారి ఖాధర్‌వలి లను ఆశ్రమ సిబ్బంది శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న ఆంజనేయరెడ్డి, అరవ పరిమళ, ఆర్ ఇందిరా, ప్రఫుల్ల జయశ్రీ, జీవి పుల్లారెడ్డి, శ్రీనివాసులు, గందవల్ల దశరధరామయ్య, ఉద్దండి కోటేష్, బషీర్, అహ్మద్, గౌస్‌బాషా, గోపి,మురళీ, పంచాక్షరి, బి.శ్రీనివాసరావు, లక్ష్మీకాంతమ్మ, చేజర్ల తేజ, తిరుపతి రావు, రమేష్, జయలక్ష్మీ, బ్రహ్మారెడ్డి, జివిరావు, భానురేఖ , శైలజ, తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారులను
## అభినందించిన ఎమ్మెల్యే



**కావలి, జనవరి 4 ప్రభాతవార్త** :శ్రీమేధా నృత్య కళానిలయం విద్యార్థులు భారత్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన భారీ కూచిపూడి నృత్య ప్రదర్శనలో గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించిన సందర్భంగా వా రిని ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అభినందించడం జిరగింది. నృత్య బృందానికి గురువుగా కోవూరు సరయుక్రిష్ణ నేతృత్వంలో 13మంది చిన్నారులు ఈ వరల్డ్ రికార్డులో పాల్గొని రికార్డును కైవసం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో వేలాదిగా బాలిబాలికలు ఏకకాలంలో కూచిపూడి నృత్యప్రదర్శన చేసి రికార్డు నెలకొల్పారు. అందులో కావలి ప్రాంతానికి చెందిన చిన్నారుల భాగస్వామ్యం కావడం పట్టణ ప్రజలకు గర్వ కారణంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురువు సరయ క్రిష్ణతో పాటు గిన్నిస్‌రికార్డులో పాల్గొన్న చిన్నారులకు చిరు సత్కారంతో ఘనంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే చిన్నవయసులోనే శాస్త్రీయ నృత్యకళలో ప్రావీణ్యం సాధించి గిన్నిస్ రికార్డు స్థాయిలో పాల్గొనడం గర్వకారణమని కొనియాడారు. కావలి పేరు ప్రపంచంలో నిలిచేలా చేసినందుకు వారందరికి అభినందనలు తెలిపారు.

## నేడు పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

**- ప్రజల ఆరేళ్ల కల సాకారం - ఆదివారం కలుజు ప్రాంతాన్ని సందర్శించిన గిరిధర్‌రెడ్డి**



**నెల్లూరు అగ్రికల్చర్, జనవరి 4, ప్రభాతవార్త** ఐదేళ్ల సుధీర్ఘ నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జిని సాధించారు. గత ప్రభుత్వంలో ఈ ప్రాంతంలో బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు పోరాటాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కూడా సీపీఎం ఆధ్వర్యంలో బ్రిడ్జి కోసం పోరాటం సాగించారు. పార్టీకి దూరంగా జరిగిన సమయంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సైతం కలుజు నిర్మాణానికి నిదులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కలుజు నీటిలో కుర్చుని నిరసన తెలియజేస్తానని ప్రకటించిన నేపథ్యంలో ఆనాడు వైసీపీ ప్రభుత్వం అడ్డుకున్న సందర్భాలు ఈ ప్రాంత ప్రజలు మరిచిపోలేరు. ప్రతి ఏటా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్న తరుణంలో ఈ ప్రాంత ప్రజలు ఈ కలుజును దాటలేక అవస్థలు ఎదుర్కొన్న సందర్భాలు ఆరేళ్లపాడు కొనసాగాయి. కలుజు ఉదృతి సమయంలో ప్రయాణిస్తూ ఈ ఆరేళ్ల కాలంలో ద్విచక్ర వాహనాలలో ప్రయాణించే బైకర్లు 6 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడి ఆసుపత్రుల పాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఎట్టకేలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు గుర్తించి కలుజుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరుకు శ్రీకారం చుట్టడంతో ప్రజల అవస్థలు తొలగిపోనున్నాయి. నేటి ఉదయం 9.30గంటల జరగనున్న శంకుస్థాపన ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని సోమవారం శంకుస్థాపన కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాసనమండలి సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పలువురు కూటమి నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కలుజు వద్ద ఏర్పాటు చేసే సభకు కూటమి నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. గిరిధర్‌రెడ్డి పర్యటనలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి చాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ ఏడుకొండలు, ఎంపీటీసీ నేరేళ్ల నారాయణ, టీడీపీ నెల్లూరు రూరల్ మండల బీసీ సెల్ అధ్యక్షులు కందల హరియాదవ్, టీడీపీ నాయకులు చెన్నారెడ్డి అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకట రమణ, శ్రీనాథ్, ఫిరోజ్, చెంచయ్య, సురేష్, ఈశ్వరయ్య, కరిముల్లా, హర్ష, ప్రశాంత్, అశోక్, పాల్గొన్నారు.

## రహదారులు అస్తవ్యస్తం...వానదారులకు తప్పని ఇక్కట్లు



**కొడవలూరు,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మండలం గుండాలమ్మపాలెం గ్రామం నుండి నాయుడుపాలెం కి వెళ్లే రోడ్డు కొన్ని సంవత్సరాల నుండి అస్త వ్యస్తంగా ఏర్పడింది. ఈ మార్గంలో ఎంతోమంది అదికారులు, వ్యాపారస్తులు,రైతులు రాకపోకలు చేస్తుంటారు.ప్రజా ప్రతినిధులు,నా యకులు ,అధికారులు మారుతున్న రోడ్డు మార్గాలు మాత్రం అభివృద్ధి కి నోచుకోవడం లేదని వాహనదారులు పేర్కొన్నారు.అదేవిధంగా గుండాలమ్మపాలెం నుండి విడవలూరు మండలం పార్లపల్లి పంచాయతీ చవటపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు నరకానికి కేరాఫ్ గా మారి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందని స్థానిక గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. అత్యవసర సమయంలో చవటపాలెం నుండి ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరి చేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే, జిల్లా అధికారులు స్పందించి అంతర్గతంగా ఉన్న రోడ్లకు కనీసం మరమ్మత్తులు అయినా చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## గజమాలతో వేమిరెడ్డి దంపతులకు సన్మానం



**కొడవలూరు,జనవరి 4 ప్రభాతవార్త:** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ని కోవూరు నియోజకవర్గ టిడిపి రైతు సంఘ అధ్యక్షులు పల్లంరెడ్డి సురేష్ రెడ్డి, పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి గజమాలలతో ఘన సన్మానం చేశారు. వేమిరెడ్డి దంపతుల సారధ్యంలో కోవూరు నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధికి చెందుతుందని కొడవలూరు మండల టిడిపి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే నాయకత్వంలో టిడిపి బలోపేతంకు కృషి చేస్తామ నన్నారు.అభిమానానికి వేమిరెడ్డి దంపతులు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్ర మంలోమండల టిడిపి యూనిట్, క్లస్టర్ మరియు బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

## కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడులు



**సైదాపురం, జనవరి 4, ప్రభాతవార్త** మండల పరిధిలోని తూర్పుపూండ్ల గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరంపై సైదాపురం ఎస్సై కాంతి కుమార్ ఆయన సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కాంతి కుమార్ మాట్లాడుతూ తూర్పుపూండ్ల అటవీ ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు పందెం కోళ్లు, రూ.11,100లు నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

## నగర శివార్లలో కార్డన్ సర్చ్ ఆపరేషన్

**- సరైన పత్రాలు లేని 70 బైకులు, 6 ఆటోలు స్వాధీనం**




**నెల్లూరు క్రైమ్, జనవరి 4, ప్రభాతవార్త:** జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్ సౌజన్య సూచనల మేరకు, సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచటానికి నగర శివార్లలోని రెండు ప్రాంతాల్లో ఏకకాలంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రెండు ప్రాంతాల్లో కలిపి సరైన పత్రాలు లేని 70 బైకులు, ఆరు ఆటోలను పోలీసులు స్వాధీనం చేస్తున్నారు. నవాబ్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీ టిడ్కో గృహ సముదాయంలో తెల్లవారుజామున ప్రతి ఇంటిని క్షుణ్ణంగా శోధించారు. టౌన్ ఇంచార్జి డిఎస్పి గిరిధర్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది, స్పెషల్ పార్టీలతో కలిపి సుమారు 125 మందితో సోదాలు జరిపారు. సుమారు 300కు ఇళ్ళను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 24 బైకులు, 3 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులను గుర్తించి, రౌడీ షీటర్స్/సస్పెక్ట్ షీటర్స్ ఇళ్ళు తనిఖీ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతి భద్రతలను పరిరక్షణ, అసాంఘీక శక్తుల ఏరివేతే లక్ష్యంగా ఈ సోదాలు కొనసాగినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. జిల్లాలో అసాంఘీక కార్యకలాపాల నిర్మూలనకు ఎస్పీ కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు, అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యం పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, వెండి, బంగారు వంటి చోరీ సొత్తు, అనుమానంగా ఉన్న, రికార్డులు లేని అన్నీ వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వాటివి గుర్తించి స్వాధీన పరుచుకోవడమన్నారు.

**నెల్లూరు రూరల్ పరిధిలో :** నెల్లూరు రూరల్ పరిధిలోని అల్లీపురం టిడ్కో గృహ సముదాయంలో తెల్లవారుజామున కార్డన్ అండ్ సర్చ్ నిర్వహించారు. రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు ఆద్వర్యంలో సిఐలు, ఎస్ఐలు సిబ్బంది, స్పెషల్ పార్టీలతో కలిపి సుమారు 120 మందితో ఆపరేషన్ జరిపారు. సరైన పత్రాలు లేని 46 బైకులు, 3 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు.

## ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన దేవరకొండ



**కావలి, జనవరి 4 ప్రభాతవార్త :** కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆశీస్సులతో కావలి పట్టణ టిడిపి ఉపాధ్యక్షులుగా దేవరకొండ శ్రీనివాసులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కాపు, నేతలు, టిడిపి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా టిడిపి కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని యాపిల్ పండ్లతో మాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకొండ శ్రీనివాసులు పార్టీపట్ల నిబద్ధతతో పనిచేస్తారని విశ్వసిస్తున్నానని పట్టణంలో టిడిపి మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ సమన్వంతో ముందుకు సాగాలి అని కోరారు. దేవరకొండ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పదవి రావడం చాలా సంతోషంగా ఉందని బాధ్యత కూడా మరింత పెరిగిందని పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి నేతలు బీమ రంగారావు బాబురావు, ఒగిరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్య అందితేనే మంచి భవిష్యత్తు ఉంటుంది

**- మంత్రి నారాయణ**



**నెల్లూరు, జనవరి 4, ప్రభాతవార్త -వైద్యం** మెరుగైన విద్య అందితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని మంత్రి నారాయణ అన్నారు. బలిజ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాపు భవన్‌లో బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు కార్యక్రమం జరిగింది. దీనికి మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి కాపు సంఘ నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రి నారాయణ చేసిన అభివృద్ధికి సంబంధించిన ఆడియో వీడియోలను కాపు నేతలు ప్రదర్శించారు. మంత్రి నారాయణ, తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదో తరగతి, ఇంటర్ మీడియట్‌లో ప్రతిభ కనపరిచిన బలిజ విద్యార్థులకు వారిద్దరూ పురస్కారాలు, నగదు బహుమతి అందజేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఏడేళ్ల నుంచి ప్రతిభాపురస్కారాలు అందిస్తున్న బలిజ సేవా సమితికి అభినందనలు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో తులసి సీడ్స్ యాజమాన్యం సేవలు అభినందనీయం అన్నారు. సరైన విద్య అందితే ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు చదువే ఈ స్థాయిని ఇచ్చిందని మంత్రి వెల్లడించారు. చదువుకోవడం వల్లే తనపై తనకు నమ్మకం కలిగిందన్నారు. ఈ స్థాయికి రావడానికి, విద్యా సంస్థలు నెలకొల్పడానికి దోహద పడిందన్నారు. తనను ఎమ్మెల్యేగా నన్ను 72వేల పై చిలుకు మెజార్టీతో గెలిపించిన ప్రజల కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. పేద పిల్లలకు విద్యని ఆస్తిగా ఇవ్వాలన్నదే తన సంకల్పం అన్నారు. ఇప్పటికే వీఆర్సీ ని అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రారంభించామన్నారు. 200 కోట్లతో మరో 14 స్కూల్స్ ని వీఆర్సీ కి మించి సిద్దం చేస్తున్నామన్నారు. వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్లతో మరో ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నామని వివరించారు. కాపు భవన్ నిర్మాణం బలిజలు ఎప్పటి నుంచో ఉన్న కల అని. 2014 లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కాపు భవన్‌ల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. తన వొంతుగా కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించానని మంత్రి స్పష్టం చేశారు. అదనపు అంతస్తుకు తాజాగా మరో కోటి రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించారు. బలిజలు అభ్యున్నతికి నా వంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. అనంతరం తులసి రామచంద్ర ప్రభు మాట్లాడారు. బలిజ సేవా సమితి మంచి కార్యక్రమం చేపట్టిందన్నారు. విద్యార్థుల్లో అణుబాంబు కంటే ఎక్కువ శక్తి సామర్థ్యాలు ఉంటాయన్నారు. క్రమశిక్షణతో సరైన ఆలోచనతో ముందుకెళ్తే అనుకున్నది సాధిస్తారని వ్యాఖ్యానించారు. అందుకు మంత్రి నారాయణ నిలువెత్తు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నేతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నిత్యం యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**- యోగా గురువు పెంచలయ్య**



**నెల్లూరు,జనవరి4 ప్రభాతవార్త-విద్య** ప్రతినిత్యం యో గా సాధనతో ఆరోగ్యంగా జీవించవచ్చని యోగా గురువు పెంచలయ్య అన్నారు. కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఆదివారం బుజబుజ నెలూరులోని శేషు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో యోగా సాధన ప్రారంభించిన యోగా గురువు పెంచలయ్య మాట్లాడుతూ నిత్యం యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్దిస్తుందని అన్నారు. మారుతున్న జీవన విధానానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. యోగా అనేది ఆరోగ్యానికి ఒక వరం లాంటిదని, మందులు లేకుండానే తగిన ఆసనాలతో శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని, బీపీ, షుగరు, క్యాన్సర్, ఒబెసిటీ రాకుండా నియంత్రించుకోవచ్చని అన్నారు. శారీరక, మానసిక ప్రశాంతతకు యోగా అవసరం: 25వ డివిజన్ కార్పొరేటర్, బద్దెపూడి నరసింహగిరి ప్రతి రోజు యోగా సాధన చేయడం వల్ల అనేక వ్యాధులను నివారించుకోవచ్చని 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహ గిరి అన్నారు. మందులు లేకుండానే యోగాసనాలతో శరీర ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను కాపాడుకోవచ్చని అన్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడంలో యోగా కీలక పాత్ర వహిస్తుందని తెలిపారు. అనంతరం యోగా గురువు పెంచలయ్యను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు శాఖవరపు వేణుగోపాల్, జెన్నీ రమణయ్య, పులి నాగేశ్వరరావు, ఒంటేరు రాజగోపాల్, శాగల సాయి, దొడ్డక రమేష్, పిగిలం గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా నూతన అధ్యక్షులుగా కిరణ్‌కుమార్‌రెడ్డి
## ఘన స్వాగతం పలికిన అభిమానులు



**మనుబోలు జనవరి 4 ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా కాంగ్రెస్‌పార్టీ నూతన అధ్యక్షులుగా మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి నియామకం అయ్యారు. మొట్టమొదటి సారిగా ఆయన నూతన అధ్యక్ష హోదాలోస్వగ్రామానికి రావడంతో ఆయన అబిమానులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత ను దర్శించుకున్నారు. తన తల్లి అయిన జాంబవతమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం డిసిసి అధ్యక్షులు కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతు రాహుల్ గాంధీకి, షర్మిలకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బిజెపి చేస్తున్న అరాచకాలను విమర్శించారు. ఉపాధీహామి పధకానికి గాంధీ పేరు తీసివేయాడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో దివంగత నేత వైఎస్ మృతి చెందిన తరువాత సరైన నాయకత్వం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ బ్రతికి ఉండే రెండు రాష్ట్రాలు ఉండేవి కాదని అన్నారు. విభజన చట్టాన్ని సరిగా అమలు చేయలేదని విమర్శించారు. దేశ అభివృద్ధి గ్రామల ప్రగతి ఒక్క కాంగ్రెస్‌పార్టీతో నే సాధ్యమని అన్నారు. రాబోయే రాజులలో ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటుందని దీమా వ్యక్తం చేశారు, 10 సంవత్సరాలుగా తనకు సహకరిస్తున్న గ్రామస్తులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో నెల్లూరు సిటి ఇంచార్జి ఇర్ఫాన్ ,సర్వేపల్లి ఇంచార్జి బళ్లారి హరి శ్రీనివాసులరెడ్డి, అమర్ శ్రీనివాసులురెడ్డి, షబ్బీర్‌భాయి, శ్రీహరిరెడ్డి అభిమానులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఎస్‌టి కాలనీల్లో అభివృద్ధి

**- విద్యకు పెద్దపీట విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేసిన సోమిరెడ్డి శృతి రెడ్డి**



**తోటపల్లి గూడూరు, జనవరి 4, ప్రభాతవార్త** మండలంలో ఆదివారం ఎస్‌టి కాలనీల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాయి. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు, టీడీపీ నాయకురాలు సోమిరెడ్డి శృతి రెడ్డి పొట్లపూడి వెంకన్నపాలెం, విలుకానిపల్లి గ్రామాల ఎస్‌టి కాలనీలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రిని, గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ తన మామ శాసనసభ్యులు చంద్రమోహన్‌రెడ్డి గత ఒకటిన్నర సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ ప్రాంతంలో రూ.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.36 లక్షలతో ఆరోగ్య కేంద్రం అభివృద్ధి, రూ.3 కోట్ల 65 లక్షలతో బీచ్ అభివృద్ధి, రూ.16 కోట్ల 70 లక్షలతో కాల్వల మరమ్మత్తులు, రూ.8 లక్షలతో సైడ్ కాలువల నిర్మాణాలు జరిగాయని తెలిపారు. అలాగే విద్యార్థులు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్ ఏర్పాటు, దేవాలయ నిర్మాణం వంటి అభ్యర్థనలు తమ దృష్టికి వచ్చాయని, ఈ విషయాలను చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న పంచాయితీ ఎన్నికల్లో గ్రామ నాయకులకు మద్దతుగా నిలవాలని ఆమె ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల పార్టీ అధ్యక్షులు కోణతం రఘుబాబు, ప్రధాన కార్యదర్శి మన్యం జితేంద్ర గౌడ్, గ్రామాల ఇన్చార్జి శ్రీ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాసులు, టీడీపీ నేతలు ఈదూరుభాస్కరయ్య, ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్న భరత్ కుమార్ రెడ్డి, గిరీష్ గోపిరెడ్డి, వెంకటేష్ యాదవ్, చింతా సీతారామయ్య, సుమన్, మత్స్యకార నేత పామంజి రామకృష్ణ, వెంకటేశ్వర్లు, విలుకానిపల్లి నేతలు గోపిరెడ్డి వెంకటేశ్వర్లు యాదవ్, సర్పంచ్ పావని తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీమల్లికార్జునస్వామికి ఆరుద్ర నక్షత్ర పూజలు



**బుచ్చి జనవరి 4 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి ఆలయంలో పరమేశ్వరుడి జన్మనక్షత్రం ' ఆరుద్ర నక్షత్రం " పురస్కరించుకొని శివకామ సుందరి సమేత శ్రీతాండవేశ్వర స్వామి వారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారి రుద్రపాదుకులకు (శఠారి) పంచామృత అభిషేకాలు,సహస్రనామార్చన పూజలు,దేవస్దాన అర్చకులు వేంద పండితులు శాస్త్రోక్తంగా నిర్వమించారు.అనంతరం స్వామి వారి శఠారి ఆశీర్వచనం,పంచామృతాభిషేక ప్రసాదం భక్తులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, నక్కల శివకృష్ణ, తిరువాయి పాటి నందకుమార్, పెన్నత్తరు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మీ, పాలూచు చాముండేశ్వరీ, కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రత్యూషా, ముంగర సుధాకర్, రామాయణం సుధారాణి, కొల్లపూడి శారద, ఆలయ అర్చకులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.